# నిత్య మరణానికి నివాళి ఎక్కడ?

కె. బాలగోపాల్

> **నిరుడు మలేరియా విభాగానికి అందవలసిన నిధులలో రెండు కిస్తులు మాత్రమే లభించాయి. దోమల మందు స్ప్రే చేసిన కూలి వారికి 5,22,680 రూపాయల కూలి బాకీ ఉండిపోయింది. అది ఇవ్వనిదే ఈసారి మందు కొట్టం అని వారు మొరాయించారు. ఈ డబ్బులు ఎక్కడినుంచి తీసి వారికి ఇవ్వాలని అధికారులు మీమాంసలో పడ్డారు. నాలుగు నెలల పాటు తర్జనభర్జనలు జరిపినా ఆ 5 లక్షల చిల్లర ఎక్కడ నుంచి తేవాలన్న నిర్ణయం చేయలేక వేలాది ఆదివాసీ కుటుంబాలను మలేరియా పాలుచేశారు.**


ఒక చావు అన్ని చావుల్నీ కప్పేసింది. వాస్తవంలో కాదు, వార్తల్లో. ఒక మరణం, ఆ మరణానికి తట్టుకోలేని మరణాలుగా వార్తల కెక్కినవి కలిసి వేరే మరణాలను వార్తల నుంచి బయటకు నెట్టేసాయి.

కప్పేయడం నిజానికి అంతకుముందే మొదలయింది. రమ్యానందినీరెడ్డి అన్నపేరు వింటే మీకేం తోస్తుంది? వస్తే స్వైన్‌ఫ్లూ రావాలి తప్ప ఏజెన్సీ మలేరియా వచ్చే పేరులాగ తోస్తుందా? పేరుకు తగ్గట్టు స్వైన్ ఫ్లూ వచ్చి ఉంటే చచ్చినా బతికినా మొదటి పేజీలో ఫోటో అయి ఉండేది. నలుదిక్కులా వార్త అయి ఉండేది. కానీ ఈ పాప కూటికి లేని కొండరెడ్డి కొంపలో రంపచోడవరం ఏజెన్సీలో పుట్టింది. మలేరియా అని ప్రభుత్వం ఒప్పుకోని మలేరియాతో రెండేళ్లకే వందేళ్లు నింపుకుంది. గోచిపాత లేకున్నా పేర్లలో షోకులకు పోవచ్చును, దానికి కావలసిన జ్ఞానం డిష్ టివి నుంచి పొందవచ్చును, కానీ పేరుకు ఉన్న షోకు చావుకు ఎక్కడి నుంచి రావాలి?

మలేరియా మలేరియా ఎందుకు కాకుండ పోతుంది, ప్రైవేట్ ఆస్పత్రి మలేరియాగా గుర్తించినది ప్రభుత్వ ఆస్పత్రిలో వేరొకటి ఎందుకు అవుతుంది అని తెలుసుకోవడానికి సిబిఐ విచారణ కోరుదామా? ఏప్రిల్ 15న మొదలు కావలసిన దోమల మందుల స్ప్రే ఈ సంవత్సరం ఆగస్టు మొదటి వారం దాకా ఎందుకు మొదలు కాలేదో విచారించి తెలపమని సిబిఐని అడుగుదామా? రంపచోడవరం ఏజెన్సీలోని 37 మెడికల్ ఆఫీసర్ పోస్టులలో 23 ఎందుకు ఖాళీగా ఉన్నాయో శోధించి చెప్పమ్మని సిబిఐని అభ్యర్థిద్దామా? మనం అడిగితే ఒప్పుకోరు కాబట్టి కేంద్రాన్ని అడగమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుదామా?

కానీ 'రోజూ చచ్చేవాడికోసం ఏడ్చే వాడెవడు?' అంటారేమో. రోశయ్య పేరుకు ముందూ వెనకా ముఖ్యమంత్రి అర్హతకు కావలసిన రెండు పొడి అక్షరాలు లేకపోవచ్చును గానీ సామెతలు బాగా చెప్తాడు. అనుమానం ఉంటే చంద్రబాబును అడగండి. ప్రస్తుతం అతను కాంగ్రెస్ నాయకులలో దైవ లక్షణాలు కనుక్కునే మూడ్‌లో ఉన్నాడు కాబట్టి ఒప్పుకుంటాడు. నిజమే, ప్రతీ సంవత్సరం వర్షాకాలం మొదలయ్యీ కాకముందే 'ఏజెన్సీని వణికిస్తు న్న జ్వరాలు' అంటూ దినపత్రికలు లోపలి పేజీల్లో తిర్యా ని నుంచి, మంగపేట నుంచి, అడ్డతీగల నుంచి, హుకుంపేట నుంచి నాలుగు పంక్తుల వార్తలొస్తుంటాయి. అప్పుడప్పుడు టోకున చావులు గణాంకాలు కూడ ఇస్తుంటా రు. రెండు నెలలు ఊపిరి బిగపట్టుకుంటే– లేదా ఆ డెడ్‌లైన్ ఉన్న వార్తలు చూడకుండ ఉంటే–అవే పోతాయి. దానికి విచారణలూ శాశ్వత పరిష్కారాలూ ఎందుకు, రాచముద్ర ఉన్న విచారణలు చేపట్టవలసిన సిబిఐని చెంచుపెంటలలోనికీ గోండు గూడాలలోనికీ లాగడం ఎందుకు.

సిబిఐని అవమానపరచడం నా ఉద్దేశ్యం కాదు. రాచముద్ర కాకపోతే రహస్యమయినా ఉండాలి. ఇందులో రహస్యం మాత్రం ఏముంది? జిల్లా మలేరియా ఆఫీసర్ గారు, ఐటిడిఏ పి.వో గారు మలేరియా ఫైలేరియా రోగాలు లేనేలేవని చెప్పడం కోసం (సారీ, వాటి నివారణ కోసం) ప్రత్యేక హోదా ఇయ్యబడ్డ ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ గారు ఉత్తరాలు ప్రత్యుత్తరాలతో 'నోట్ ఫైల్స్'అని అధికారులు ఆప్యాయంగా పిలుచుకునే దస్తావేజులు నింపారు. సమాచారహక్కు చట్టం కింద వాటిని సహితం మనం చూడవచ్చు. చట్టం ఉన్నా లేకున్నా ఆ అధికార్లంటే గిట్టనివాళ్లను పట్టుకొని 'నోట్‌ఫైల్స్' ఫోటోస్టాట్ సంపాదించడం యోగ్యులయిన ఉద్యమకారులకు తెలిసిన విద్యే. గడచిన నాలుగు నెలలుగా నడిచిన ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను చూస్తే అర్థమయ్యే విషయం ఏమిటంటే నిరుడు మలేరియా విభాగానికి అందవలసిన నిధులలో రెండు కిస్తులు మాత్రమే లభించాయి. మరొక రెండు కిస్తులు ఏ కారణంగానో లభించలేదు. అందువల్ల నిరుడు రెండవసారి దోమల మందు స్ప్రే చేసిన కూలివారికి 5, 22, 680 రూపాయల కూలి బాకీ ఉండిపోయింది. అది ఇవ్వనిదే ఈ సారి మందు కొట్టం అని వారు మొరాయించారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి తీసి వారికి ఇవ్వాలి అన్న మీమాంస ఈ అధికారుల 'నోట్ ఫైల్స్' లో మనకు కనిపిస్తుంది. నాలుగు నెలల పాటు తర్జనభర్జనలు జరిపి నా ఆ 5 లక్షల చిల్లర ఎక్కడ నుంచి తేవాలన్న నిర్ణయం చేయలేక వేలాది ఆదివాసీ కుటుంబాలను మలేరియా పాలుచేశారు.



డబ్బులు బాకీ ఉన్న కూలివాళ్లు మొరాయిస్తే మరి వేరే వాళ్లనెందుకు పెట్టుకోలేదు? దిన కూలి ఇచ్చి చేయించుకునే పనే కదా? అది నైపుణ్యంతో కూడిన పని కాబట్టి వీలుకాదంట. నైపుణ్యంతో కూడిన పనయితే ప్రతీ సంవత్సరం వారే చేసేటట్టయితే, వారు దిన కూలీలుగా ఎందుకున్నారు? ప్రభుత్వ ఉద్యోగాలెందుకు ఇవ్వలేదు? సీజనల్ ఉద్యోగాలు ప్రభుత్వానికయినా పరిశ్రమలకైనా కొత్తేం కాదు కదా? అప్పుడొక వేళ జీతం బకాయిపడినా ఉద్యోగం నిలబెట్టుకోవడానికి పనిచేసేవారు కదా?అయినా, రంపచోడవరం ఏజెన్సీలో 624 గ్రామాలను (మొత్తం గ్రామాలలో ఇది 90 శాతం కంటే ఎక్కువ) మలేరియా 'ఎండెమిక్'గా అధికారికంగానే గుర్తించినప్పుడు జిల్లా మలేరియా అధికారి వద్ద కొంతయినా కంటింజెన్సీ ఫండ్ ఎందుకు లేదు? ఆయనగారు, ఒక అసిస్టెంట్ మలేరియా అధికారి, మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రాంతాలకు కలిపి ఒక సబ్-యూనిట్ అధికారి తప్ప రోడ్ల వెంబడి తిరిగి పనిచేసే సిబ్బంది వారి కింద ఎందుకు లేరు? కూలివాళ్ల బకాయిలకు పైసలు లేకపోవడమే కాదు, ప్రతీ సంవత్సరం మార్చి నెలలో సరఫరా కావలసి ఉన్న దోమల మందు ఈ సంవత్సరం జూన్ నెల దాకా రాలేదంట. దానికి కారణం ఎవరికీ తెలిసినట్టు లేదు కాబట్టి అడిగి ప్రయోజనం లేదు గానీ, అవసరమయినప్పుడు మార్కెట్‌లో కొనుగోలుచేసే అధికారం, దానికి విడిగా కొంత ఫండ్ జిల్లా మలేరియా అధికారి దగ్గర ఎందుకు లేవు? నాకు స్టాఫ్ లేరు అంటూ దర్జాగా బల్లకింద కాళ్ళూపుకుంటూ కూర్చునే వైభోగం అతనికెందుకిచ్చారు?

వేరొక సందర్భమయితే ఇంక వివేచించడం అనవసరం అని ఆపేద్దుము గానీ మనం గత అయిదేళ్లుగా దీనజన రాజ్యంలో బతికామని స్వపక్షం, విపక్షం, ఒక వామపక్షం, టివిలలో దర్శనమిచ్చే పలువురు నిత్య విమర్శకులే కాక 'ఆ రెండు పత్రికలు' కూడ చెప్తున్నాయి కాబట్టి కొన్ని జ్ఞాపకాలను దూరం చేయడం కష్టం. ఏజెన్సీలో జ్వరాలనూ చావులనూ ఎందుకు ఆపలేకపోతున్నామో తెలపమని 2005లో కె.ఆర్. వేణుగోపాల్ అనే రిటైర్డ్ ఐఎఎస్ అధికారిని జాతీయ మానవహక్కుల కమిషన్ పురమాయించింది. ఆయన విశాఖపట్నం ఏజెన్సీలోని పరిస్థితిని వివరంగా పరిశీలించి రిపోర్టు ఇచ్చారు. ఇప్పుడు 'ఆశావర్కర్' అని ప్రభుత్వం ముచ్చటయిన కొత్త పేరుపెట్టిన కమ్యూనిటీ హెల్త్ వర్కర్ ఉద్యోగభద్రత గురించి, రోగమొస్తే తట్టుకునే శక్తిని ఇచ్చే పౌష్టికాహారం పొందగల స్తోమత గురించి, పరిసరాల పారిశుధ్యాన్ని గురించి, మూడవ వంతు కుటుంబాలకు కూడ అందని దోమ తెరల సరఫరా గురించి, 'మొబైల్'గా ఉండవలసిన ఏజెన్సీ వైద్యవ్యవస్థ 'మొబిలిటి' సంగతి అటుంచి సగభాగం అసలే లేకపోవడం గురించి ఆయన తీవ్ర విమర్శ చేశారు. నిర్దిష్టమైన సూచనలు చేశారు. నాలుగేళ్ళయింది కాబట్టి ఆ నివేదిక ప్రభుత్వానికి అందే ఉంటుంది!

ఈ నాలుగేళ్లలో ఏం మారిందన్న ప్రశ్న వేసుకుంటే శూన్యం అన్న జవాబు చెప్పవలసి ఉంటుంది. కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ పేరొక్కటి మారింది. ఆదిలాబాద్‌లో నయితే ఒకడుగు వెనక్కివేసి ఏజెన్సీలో 'ఎండెమిక్'గా ఉన్న రోగాలను నయం చేయడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ వల్ల కాదని చేతులెత్తేసి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయోగం మొదలుపెట్టారు. పబ్లిక్ హెల్త్‌రంగంలో ఈ విధంగా చేతులెత్తేయడం ప్రస్తుత దుస్థితికి గల ఒక ముఖ్యకారణం అనేది కె.ఆర్. వేణుగోపాల్ విమర్శలో ప్రధాన అంశం కాగా, చేసిన తప్పు ఇంకొంచెం చేయడమే సమస్యకు పరిష్కారం అయినట్టు చికిత్స విషయంలోనూ అదే పనిచేస్తున్నారు. ప్రైవేటీకరణతో మన అనుభవం ఏమిటంటే ఏ కారణంగానయితేనేం అది మొదట్లో కొంత ఫలితాన్ని ఇస్తుంది (ఇది కుట్ర అనేవాళ్లు లేకపోలేదు). అందువల్ల వ్యాపిస్తుంది. చివరికి దాని దుష్ఫలితాలు తెలిసేసరికి వెనక్కి తిప్పడం కష్టం అవుతుంది. పౌష్టికాహారం విషయానికొస్తే, పెద్దల సంగతి అటుంచి పిల్లలకు కనీసం ఒక పూట అన్నంపెట్టే అంగన్‌వాడీ కేంద్రాలు ఆదివాసీ ప్రాంతాలలోని సగం గూడాలలో ఆనాడూ లేవు, ఈనాడూ లేవు. ఉట్నూరు నుంచి సీతంపేట దాకా ఏ ఏజెన్సీ గ్రామంలో వాకబు చేసినా ఈ సత్యం తెలుస్తుంది. ఏజెన్సీ మరణాలలో చిన్న పిల్లల సంఖ్య ఎక్కువ ఉండడానికి ఇదొక కారణం అని వివరించి చెప్పనవసరం లేదు.

సంగతీ స్పష్టమే, దానికి గల కారణమూ స్పష్టమే. వాళ్లంటే లెక్కలేకపోవడం తప్ప విచారించి బయటపెట్టవలసిన రహస్యమేదీ ఇక్కడ లేదు. ఇక విచారణలు కోరడం ఎందుకు?